క్లుప్తంగా

దాతల కృషి అభినందనీయం



విరాళం అందజేస్తున్న భానుచందర్‌చారి

మొయినాబాద్ రూరల్: రక్తమైసమ్మ దేవాలయ నిర్మాణానికి దాతలు చేస్తున్న కృషి అభినందనీయమని దేవాలయ పూజారి అంజన్‌శాస్త్రి పేర్కొన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్‌లో రక్తమైసమ్మ దేవాలయ నిర్మాణంలో భాగంగా గ్రామానికి చెందిన భానుచందర్‌చారి రూ. 50వేలు విరాళాన్ని పూజారి అంజన్‌శాస్త్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రతలో కార్మికుల పాత్ర కీలకం



దుస్తులు పంపిణీ చేస్తున్న కరుణాకర్‌రెడ్డి

చేవెళ్ల: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతలో కార్మికుల పాత్ర కీలకమని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీజేపీ నాయకుడు గోనె కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మడిమ్యాల్ గ్రామ పంచాయతీ సిబ్బందికి తన సొంత డబ్బులతో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవకాశం ఉన్నంత మేర సాయం చేసేందుకు ఎల్లప్పుడు ముందుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ చేవెళ్ల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



సీఎం రేవంత్‌రెడ్డికి బొకే ఇస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

షాబాద్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని నియమించిన సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తనను రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రెడ్డి, నాయకులు, తదితరులు ఉన్నారు.

సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

శంకర్‌పల్లి: ఎల్వర్తి గ్రామంలో దేవీ శరన్నవరాత్రుల వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం పురోహితులు అక్షయ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో 108 మంది మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భవానీమాత మాల ధరించిన స్వాములు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

జేసీబీని అడ్డుకున్న రైతులు అరెస్ట్

కొందుర్గు: ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయనున్న పొలం తమదని జేసీబీలను అడ్డుకోబోయిన రైతులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొందుర్గు శివారు సర్వే నంబర్ 109లో పాఠశాల భవన నిర్మాణం కోసం అధికారులు రెండు రోజులుగా స్థలాన్ని చదునుచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమిపూజ చేయనుండగా.. ఈ సర్వే నంబర్‌లో తమకు 11 ఎకరాల అసైన్డ్ భూమి ఉందని కొందుర్గుకు చెందిన రైతులు సున్నాల శ్రీనివాసు, సున్నాల నర్సింహులు, సున్నాల చిన్న రాములు, సున్నాల రామచంద్రయ్య ఉదయం జేసీబీలను అడ్డుకోబోయారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి, జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారిని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. బాధిత రైతులకు అండగా ఉంటామని, ప్రభుత్వ నియంతృత్వాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.



తుక్కుగూడ: మహిషాసుర మర్దినిగా దర్శనం ఇస్తున్న అమ్మవారు



తుక్కుగూడ: రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో..



కందుకూరు: గూడూరులో దుర్గామాతకు పూజలు చేస్తున్న సీఐ సీతారామ్ తదితరులు



పహాడీషరీఫ్: జల్‌పల్లిలో అమ్మవారి పూజలో అందెల శ్రీరాములు యాదవ్



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలు

మహేశ్వరం నియోజకవర్గంలోని పలు మండలాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఆయా మండపాల వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలకు నిర్వాహకులు పూజలు నిర్వహిస్తున్నారు. పలువురు రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం తొమ్మిదోరోజు మహిషాసురమర్దిని రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంతలో పండుగ సందడి



కొనుగోలు దారులతో రద్దీగా సంత

ఆమనగల్లు: విజయదశమిని పురస్కరించుకుని క్రయవిక్రయదారులతో దుకాణసముదాయాలు కిటకిటలాడుతున్నాయి. వాహనాల రాకపోకలతో రహదారులు రద్దీగా మారాయి. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం కొనసాగిన సంతలో కొనుగోలు దారులతో సందడి నెలకొంది. ప్రయాణికుల రాకపోకలతో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలు క్యూకట్టాయి. ఎక్కడ చూసినా సందడే కనిపించింది.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి పోల్కంపల్లి గ్రామానికి చెందిన 9 మందికి రూ.3.73 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ రూ.5 లక్షలు ఉంటే.. రూ.10 లక్షలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెంచారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని, త్వరలోనే మరిన్ని పథకాలకు శ్రీకారం చుట్టనుందని వెల్లడించారు.

క్రీడలతో మానసికోల్లాసం

• చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి భీంభరత్



బహుమతులు ప్రదానం చేస్తున్న భీంభరత్ తదితరులు

షాబాద్: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలో పోతుగల్ గ్రామంలోని పీఎన్‌ఆర్ గ్రౌండ్‌లో సూర్య విలేజ్ ప్రీమియర్ లీగ్ స్పాన్సర్స్ సూరన్న, శ్రీరామ్‌రెడ్డి సహకారంతో, షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింహులు ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి ఊరెళ్ల జట్టుకు రూ.1లక్ష, నగదు, షీల్డ్ అందజేశారు. రెండో బహుమతి ఎర్రోనిగూడ జట్టుకు రూ. 50వేల నగదు, షీల్డ్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో ప్రయత్నిస్తే విజయం వరిస్తుందన్నారు. ఓటమి గెలుపునకు నాంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

మొయినాబాద్: దసరా పండుగ సందర్భంగా మండల పరిధిలోని సురంగల్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకట్‌రెడ్డి, లక్ష్మి దంపతులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామంలోని 350 మంది మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి మాట్లాడారు. గ్రామ ప్రజలకు అన్ని విధాలుగా సేవ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజు, విక్రంరెడ్డి, గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: నిరుపేదలకు ఉచితంగా చీరలు పంపిణీ చేసిన్నట్లు తాళ్లపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు జోగు వెంకటయ్య అన్నారు. శుక్రవారం నాగర్‌గూడలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు దసరా పండుగ సందర్భంగా ఉచితంగా తాళ్లపల్లి, నాగర్‌గూడ, లక్ష్మరావుగూడ, వెంకటమ్మగూడ గ్రామాల ప్రజలకు చీరలు పంపిణీ చేసిన్నట్లు చెప్పారు. తను సంపాదించిన దాంట్లో కొంత పేదలకు ఖర్చు చేస్తానన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఆమనగల్లు: మండల పరిధి పోలెపల్లి గ్రామంలో శుక్రవారం పోలెపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు అభినవ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఆయన క్రికెట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, కిరణ్, శ్రీను, మహేందర్, నరేశ్, మల్లేశ్, యశ్వంత్, నిఖిల్, నవీన్, శివ, గోపి తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

కడ్తాల్: మండల పరిధి మైసిగండి గ్రామ పంచాయతీ ఎల్లమ్మతండా కాలనీ, పదుశ్రీ కాలనీల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లో నిత్యం వోల్టేజి సమస్య తలెత్తుండటంతో స్థానిక నాయకులు, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఏఈ నరేందర్ శుక్రవారం కాలనీల్లో పర్యటించి, సమస్య తెలుసుకున్నారు. పీసీసీ సభ్యుడితో కలిసి 25 కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశారు. లో వోల్టేజి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. జవహర్‌లాల్‌నాయక్, హీరాసింగ్, ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

తలకొండపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీపీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండల పరి ధి చీపునుంతల్లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దర్గమాతా మండపంలో ఆయన శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు.

ద్వారకామయి పీఠాన్ని సందర్శించిన కమిషనర్



పూజలో కమిషనర్ చంద్రశేఖర్, పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామి

మీర్‌పేట: మీర్‌పేట ప్రశాంతిహిల్స్‌లోని ద్వారకామయి సాయిబాబా పీఠంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలకు కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డిలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామి వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.